క్లుప్తంగా

నేడు మంచాలలో గడప గడపకు మన ప్రభుత్వం

చేబ్రోలు: మండలంలోని మంచాలలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్ని వివరించడంతో పాటు ప్రజా సమస్యల్ని క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. గ్రామంలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



గుంటూరు రూరల్: చిన్ననాటి నుంచే విద్యార్థులు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ సూచించారు. నగర శివారు లాంలోని కళాశాల వద్ద అమరావతి రోడ్డులో గురువారం కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని చైర్మన్ వై.వి. ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రానున్న వేసవిలో ప్రయాణికుల దాహార్తికి మజ్జిగ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు తక్కెళ్లపాడుకు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: విద్యుత్తు లైన్ల మరమ్మత్తుల కారణంగా మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులంతా మంచి మార్కులు సాధించాలి

పెదనందిపాడు: పదో తరగతి విద్యార్థులంతా కష్టపడి చదివి, పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని డెప్యూటీ డీఈవో సుధాకర్‌రెడ్డి సూచించారు. ఆయన గురువారం మధ్యాహ్నం పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాల్ని బాగా అర్థం చేసుకోవాలని చెప్పారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ



పెదకాకాని: పెదకాకాని గ్రామానికి చెందిన మాడా సాంబశివరావు షుగర్ వ్యాధితో బాధపడుతూ రెండు రోజుల కిందట గుంటూరులోని ఓ ఆసుపత్రిలో చేరారు. గురువారం సాయంత్రం కాలుకు ఆపరేషన్ చేయించుకోవాల్సి ఉంది. విషయం తెలుసుకున్న వలంటీర్ జిడుగు కృష్ణవేణి ఉదయమే ఆస్పత్రికి వెళ్లి సాంబశివరావుకు పింఛన్ అందజేసింది. ఆపద సమయంలో నగదు అందజేసిన వలంటీర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్లాస్టిక్ గోదాం దగ్ధం



గుంటూరు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్లాస్టిక్ గోదాం దగ్ధమైన సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నల్లపాడు సీతారామ టౌన్‌షిప్‌కు చెందిన గాలి వెంకటరెడ్డి మిర్చి యార్డు సమీపాన ఉన్న ఖాళీగా ఉన్న శ్రీరామ జిన్నింగ్ మిల్లును అద్దెకు తీసుకుని ప్లాస్టిక్ సామగ్రిని గోదాంలో నిల్వ చేశాడు. గురువారం ఉదయం అవసరమైన సరుకుని బయటకు తీసి అనంతరం తాళాలు వేసుకుని వెళ్లాడు. సాయంత్రం గోదాం పైనుంచి పొగ మంటలు రావడంతో స్థానికులు అతనికి సమాచారం అందించగా సంఘటనా స్థలికి చేరుకున్నాడు. మంటలు ఎగిసి పడుతుండటంతో ఫైర్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే ఫైర్ సిబ్బంది చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. గోదాంలోని ప్లాస్టిక్ సామాను విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు గుర్తించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

నిబద్ధతతో కూడిన జీవితం కృష్ణారెడ్డి సొంతం

- కుటుంబానికి అండగా నిలుస్తాం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, నేతలు

గుంటూరు రూరల్: నిజాయతీ, నిబద్ధతతో కూడిన జీవితం తనుబుద్ధి కృష్ణారెడ్డి సొంతమని ప్రభుత్వ సలహాదారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల హఠాన్మరణం పొందిన కార్పొరేటర్ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల్ని గురువారం రెడ్డిపాలెంలోని వారి స్వగృహంలో సజ్జల పరామర్శించారు. కృష్ణారెడ్డి అకాల మరణంపై ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎంతో కాలంగా రాజకీయాల్లో ఉంటున్నప్పటికీ స్వలాభాపేక్ష లేకుండా నిత్యం సమాజ అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో వ్యవహరించే కృష్ణారెడ్డి పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తారని తెలిపారు. ఆయన అకాల మరణం కుటుంబానికి మాత్రమే కాకుండా పార్టీకి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఇటు పార్టీకి, అటు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌ఆలోచనా విధానానికి అనుగుణంగా పేద ప్రజానీకానికి కృష్ణారెడ్డి చేసిన సేవల్ని పార్టీ ఎన్నటికీ మరువబోదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌ఆదేశాల మేరకు కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా నిలుస్తుందని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ కృష్ణారెడ్డి మరణంతో పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. మంచితనానికి మారుపేరైన ఆయన మన మధ్య లేకపోవడం నిజంగా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ రాజకీయం, నిజమైన ప్రజాసేవకు కృష్ణారెడ్డి జీవితమే ప్రత్యక్ష నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎంత నిజాయతీగా ఉన్నప్పటికీ ఎంతో కొంత వ్యతిరేకత ఎదుర్కొనడం ఎవరికైనా సహజమే కానీ, కృష్ణారెడ్డి గురించి ఒక్కరు కూడా వ్యతిరేకంగా మాట్లాడిన వారు లేరని తెలిపారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏకగ్రీవంగా ఎన్నికై తన డివిజన్‌వేగంగా అభివృద్ధి చెందడంలో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా మాట్లాడుతూ పది మందికి మంచి చేస్తూ ముందుకు సాగే మనస్తత్వం గల కృష్ణారెడ్డి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సున్నిత మనస్కుడు, సాధు స్వభావి అని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికే పరితపించే వ్యక్తిత్వం గల కృష్ణారెడ్డి అకాల మరణం ఈ ప్రాంత ప్రజలకు కూడా తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, పార్టీ నేతలు బందా రవీంద్రనాథ్, ఈచంపాటి వెంకటకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పెద్ద సంఖ్యలో కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, డివిజన్‌అధ్యక్షులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ

- గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుచరిత
- కొండేపాడులో రెండో రోజు అపూర్వ స్వాగతం



దివ్యాంగుని సమస్యను అడిగి తెలుసుకుంటున్న శాసనసభ్యురాలు మేకతోటి సుచరిత

కొండేపాడు (ప్రత్తిపాడు): అవ్వా.. నీకు నెలనెలా క్రమం తప్పకుండా పింఛను వస్తుందా? అన్నా రైతు భరోసా డబ్బులు మీ ఖాతాకు జమ అవుతున్నాయా? ఏమ్మా మీ బిడ్డ అమ్మ ఒడి అందిందా? పాప మీ స్కూలులో జగనన్న గోరుముద్ద బాగుంటుందా? అంటూ ఎమ్మెల్యే సుచరిత పేరుపేరునా ప్రజల్ని పలకరించి వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడు మండలం కొండేపాడులో గురువారం 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సుచరిత గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమమనేది నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హత ఉన్న వారు ఎప్పుడైనా సచివాలయాల్లో పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని చెప్పారు. అమ్మఒడి ద్వారా డ్రాపవుట్స్‌కు చెక్ పెడుతున్నారని తెలిపారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖల్ని సమూలంగా మార్చివేసిన నేత జగన్ అని చెప్పారు. రైతాంగ శ్రేయస్సే లక్ష్యంగా రైతు భరోసా కేంద్రాల్ని ఏర్పాటు చేసి, వాటి ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందుల్ని అందిస్తున్న ప్రభుత్వం తమదేనని తెలిపారు. పథకాల అమలు, సంక్షేమ ఫలాలు అందుతున్న తీరులో ఏపీ వైపు దేశమంతా చూస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి, ఎంపీపీ దాసరి అన్నమ్మ, పార్టీ మండల కన్వీనర్ గట్టు విజయ్, సర్పంచ్ నర్రా రాంబాబు, సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాష్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మురళి, పార్టీ నాయకులు దాసరి చెంచురామారావు, పచ్చల భాస్కర్, పి. శ్రీనివాసరావు, ముప్పాల కిరణ్, ఎం. శ్రీనివాసరావు, పర్చూరి కోటేశ్వరరావు, వేణుగోపాలప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

గ్రామంలో బుధవారం జరిగిన గడప గడపకు కార్యక్రమంలో టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు చౌదరి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామ సర్పంచ్ నర్రా రాంబాబు సమక్షంలో ఎమ్మెల్యే సుచరిత వెంకటేశ్వర్లుకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

పెంచిన గ్యాస్ ధరలపై నిరసన



పెదనందిపాడులో నేతల నిరసన

పెదనందిపాడు: కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ ధరల్ని తగ్గించాలని సీఐటీయూ జిల్లా నేత కాకుమాను నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పెదనందిపాడ పాత బస్టాండ్ సెంటర్‌లో గురువారం మధ్యాహ్నం సీపీఎం నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా క్రూడ్ అయిల్ ధరలు పెరగకపోయినా, మోదీ ప్రభుత్వం గ్యాస్ ధరల్ని పెంచిదని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పుడు రూ. 400 ఉన్న సిలిండర్ ధర నేడు రూ. 1200కు పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్, సభ్యులు జంపని రామారావు, చుక్కా యానాదులు, పి. భువనేశ్వరి, షేక్ సలీం, మద్దూరి రమణ, వెంకటశివరావుపాల్గొన్నారు.

పెదకాకానిలో..

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచటాన్ని నిరసిస్తూ సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో పెదకాకానిలో గురువారం నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల శాఖ సభ్యులు బురదగుంట సాంబయ్య, సంకురి నీలాంబరం, కుక్కల రాఘవయ్య, జెట్టి రాజ్యలక్ష్మి, ఆముదాల నాగేశ్వరరావు, లక్ష్మీకాంతమ్మ ఎస్.కె. మీరావలి పాల్గొన్నారు.

తామర పురుగుపై అప్రమత్తత అవసరం

చేబ్రోలు: మామిడిలో తామర పురుగులపై జాగ్రత్తలు తీసుకోవాలని మామిడి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త జి. స్రవంతి సూచించారు. చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెంలో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడిలో సమగ్ర సస్య రక్షణపై రైతులకు శిక్షణ ఇచ్చారు. శాస్త్రవేత్త స్రవంతి మాట్లాడుతూ ప్రస్తుతం మామిడిలో తేనె మంచు పురుగులు, తామర పురుగు, గొంగలి పురుగు ఉధృతిని గమనించినట్లు తెలిపారు. వీటి నివారణకు ఎమామెటిన్, బెన్‌జోయెట్‌లను వేపనూనెలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాండం మొదలు నుంచి చివరి ఆకు వరకు తడపాలని చెప్పారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ యువత రాణించాలి

- ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి
- మలినేనిలో అట్టహాసంగా సంస్కృతి–23 ఫెస్ట్



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాణి

పుల్లడిగుంట (ప్రత్తిపాడు): విద్యతో పాటు శాస్త్ర, సాంకేతికత రంగాల్లోనూ యువత రాణించాలని ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సంస్కృతి–23 ఫెస్ట్ అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఫెస్ట్‌లో తొలి రోజు గురువారం పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్‌ల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం క్రీడా, నృత్య, సంగీతల పోటీల్లో యూత్ తమ సత్తాను చాటుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లోనూ తమ నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. అప్పుడే జీవితంలో అనుకున్న లక్ష్యాలను అధిగమించడం సాధ్యపడుతుందన్నారు. హైదరాబాద్ సంస్కార ఫౌండేషన్ చైర్మన్ టి.జ్యోత్స్న మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే పెద్దల పట్ల గౌరవ మర్యాదలు, మన సంస్కృతి సంప్రదాయాలపై వివరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఏది మంచి, ఏది చెడు అన్న విషయాలను ఎప్పటికప్పుడు వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. ఏఎన్‌యూ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ హెడ్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యార్థిగా ఉన్నప్పుడే జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవాలని సూచించారు. పాఠశాల విద్యా ఆర్జేడీ జీవీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టాలన్నారు. రాత్రి నిర్వహించిన సినీ డీజే మ్యూజికల్ నైట్ యువతను ఉర్రూతలూపింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, కన్వీనర్ డాక్టర్ డి శ్రీనివాస కుమార్, ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, డీన్ జె కిషోర్‌బాబు పాల్గొన్నారు.

రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని అందించాలి



డీలర్లు, కంపెనీల ప్రతినిధులతో నేషనల్ సీడ్ కార్పొరేషన్ అధికారులు

గుంటూరు రూరల్: నాణ్యమైన విత్తనాలతో రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని నేషనల్ సీడ్ కార్పొరేషన్ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఎ. బ్రిట్టో తెలిపారు. నగర శివారుల్లోని లాంఫాంనందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విత్తన ఉత్పత్తి, విక్రయదారులు, డీలర్లు, కంపెనీల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిట్టో మాట్లాడుతూ నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో, ఈనామ్‌తో అనుసంధానం అవ్వడం వల్ల రైతులకు కలిగే లాభాల్ని వివరించారు. రైతులు పంటల్ని పండించిన తరువాత వాటి ప్రాసెసింగ్, కొనుగోలు, మార్కెటింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ ప్రతినిధి శరత్‌బాబు, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం, శాస్త్రవేత్తలు డాక్టర్ గంగాదేవి, డాక్టర్ అనిల్‌కుమార్, సురేష్, జగదీష్ దేశముఖ్, మల్లికార్జున, డి. శ్రీనివాస్, అమన్‌మిశ్రా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఇస్మాయిల్ మృతదేహం

పెదకాకాని: జాతీయ రహదారిపై ముందు వెళుతున్న రిక్షా బండిని ఢీకొని బైక్ నడుపుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పెదకాకాని సమీపంలో చోటు చేసుకుంది. తాడేపల్లి మండలం, కొలనుకొండ గ్రామానికి చెందిన సయ్యద్ ఇస్మాయిల్ (42) ఇళ్ల వెంట తిరిగి గ్యాస్ పొయ్యిలు రిపేరు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె గుంటూరులోని పొన్నూరు రోడ్డులో ఉన్న మదర్సాలో చదువుకుంటోంది. ఆమెను చూసేందుకు గురువారం ఉదయం 4 గంటలకు ఇంటి నుంచి బయలు దేరి గుంటూరు చేరుకున్నాడు. తిరుగు ప్రయాణంలో సుమారు 6 గంటల సమయంలో పెదకాకాని డక్కన్ టుబాకో కంపెనీ సమీపంలోకి చేరుకునే సరికి ఇస్మాయిల్ నడుపుతున్న బైక్ ముందు వెళుతున్న చెక్క బండి రిక్షాను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ఇస్మాయిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. రిక్షాపై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులు అప్పగించినట్లు చెప్పారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చేబ్రోలు: రైలు ఢీకొని నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించిన సంఘటన గురువారం జరిగింది. పట్టాలు దాటే సమయంలో ప్రమాదవశాత్తూ ట్రైన్ ఢీ కొట్టడంతో అక్కడక్కడే మరణించాడు. తల, మొండెం వేరు పడింది. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. బాపట్ల రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాస్తవాలను వక్రీకరించడం తగదు

ప్రత్తిపాడు: వాస్తవాల్ని వక్రీకరిస్తూ ఎల్లో మీడియా వార్తల్ని ప్రసారం చేయడం మానుకోవాలని ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి సూచించారు. కొండేపాడులో బుధవారం రాత్రి జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యే సుచరితను నిలదీసినట్లు, ఊరి నుంచి వెళ్లిపోండి అన్నట్లుగా ఓ చానల్ వార్తల్ని ప్రసారం చేయడాన్ని జెడ్పీటీసీ గురువారం తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా సత్యదూరమని చెప్పారు. వాస్తవానికి కొందరు సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు కొన్ని అందుతున్నాయని, మరికొన్ని అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారన్నారు. అప్పటికప్పుడు స్పందించిన ఎమ్మెల్యే సుచరిత సంబంధిత వ్యక్తుల పేర్లు నమోదు చేసుకుని, వారి అర్హతను పరిశీలించి, అర్హులైతే వెంటనే వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీరమ్యతో పాటు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వాలంటీర్లుకు ఆదేశాలు జారీ చేశారని జెడ్పీటీసీ చెప్పారు. అయినప్పటికీ వాస్తవాన్ని వక్రీకరించి కథనం ప్రసారం చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని కృష్ణారెడ్డి సూచించారు.

కన్నుల పండువగా అష్టోత్తర కలశాభిషేకం



విశ్వనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న విశ్వయోగి విశ్వంజీ

చినకొండ్రుపాడు (ప్రత్తిపాడు): విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ జన్మదినోత్సవాల్లో భాగంగా చినకొండ్రుపాడులోని విశ్వనగర్‌లో రెండవ రోజైన గురువారం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సుబ్రహ్మణ్యస్వామికి అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. విశ్వంజీ ప్రత్యేక అభిషేకాలు జరిపారు. విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు దంపతులతో విశేష పూజలు చేయించారు. తొలుత ఉదయం వేద పండితుడు కూనపులి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో దుర్గా సప్తశతీ రాజశ్యామలా మంత్ర సంపుటీ పూర్వక చండీ పారాయణ, సుందరకాండ పారాయణ, ధన్వంతరీ జపాలు, కమలాలయ దుర్గామంత్ర సంపుటిత శ్రీసూక్త మహాలక్ష్మి హోమం, సహస్రనామ కుంకుమార్చనలు, రుద్రక్రమార్చనలు నిర్వహించారు. రాత్రి విశ్వశాంతి కోసం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విశ్వంజీ కల్యాణ ఘట్టంలో పాల్గొని దంపతులకు ఆశీర్వచనాలు అందించారు.

గ్రీన్ సింథసిస్‌తో పర్యావరణ సమస్యలకు పరిష్కారం



అతిథులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

గుంటూరు రూరల్: పునరుత్పాదక వనరుల వినియోగం తగ్గించి సాంకేతికత ద్వారా కాలుష్యాన్ని నిరోధించడం గ్రీన్ సింథసిస్ ముఖ్య లక్ష్యాలని సౌత్ ఆఫ్రికా యూనివర్సిటీ ఆఫ్ క్వాజుల నతల్ ప్రొఫెసర్ జొన్నలగడ్డ శ్రీకాంత్ పేర్కొన్నారు. లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో గురువారం గ్రీన్ సింథసిస్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయనాల ద్వారా ఉద్భవించే ఎన్నో ఉత్పత్తుల వల్ల వచ్చే హానికర ప్రభావాల్ని తగ్గించే ప్రక్రియలో గ్రీన్ సింథసిస్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సరళమైన ఖర్చుతో, మంచి స్థిరత్వంతో, విషపూరితం కాని ఉత్పత్తులతో సులభంగా విస్తృత గ్రీన్ సింథసిస్ ద్వారా ఇది సాధ్యమవుతుందని వివరించారు. మానవ శరీరంలో ఔషధాల వినియోగం వల్ల కలిగే ఎన్నో ఇబ్బందుల నుంచి సులువుగా బయటపడే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీవీఐటీ మెకానికల్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు

పెదకాకాని: తమ కళాశాలకు చెందిన 63 మంది మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు పొందారని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగ నియామకాలు పొందిన విద్యార్థుల అభినందన సభ గురువారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ మెకానికల్ నాలుగో సంవత్సరానికి చెందిన 24 మంది కాగ్నిజెంట్ టెక్నాలజీలో రూ. 5 లక్షల వార్షిక వేతనంతో నియామకాలు పొందారని చెప్పారు. 15 మంది ఇసూజీలో రూ. 4 లక్షల వార్షిక వేతనం, మహీంద్ర, రోబోల్యాబ్స్, ర్యాంప్, మ్యూసిగ్మా, ఐటీసీ వంటి కంపెనీల్లో రూ. 6.50 లక్షల వార్షిక వేతనంతో 24 మంది విద్యార్థులు ఉద్యోగ నియామకాలు పొందారని వివరించారు. విద్యార్థుల్ని అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, ప్లేస్‌మెంట్ డీన్ ఎం.వి. రఘురామ్, అకడమిక్ డీన్ కె. గిరిబాబు, అడ్మిన్ డీన్ ఎన్. కుమారస్వామి, మెకానికల్ విభాగాధిపతి కె. సత్యనారాయణ, కె.యు.ఎల్. సోమశేఖర్, అధ్యాపకులు ఉన్నారు.

సిబార్ దంత వైద్య కళాశాలకు అవార్డుల వెల్లువ



విద్యార్థులను అభినందిస్తున్న డీన్ కృష్ణప్రసాద్ తదితరులు

పెదకాకాని: సిబార్ దంత వైద్య కళాశాల పీజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ జాతీయ అవార్డుల్ని కైవసం చేసుకోవడం అభినందనీయమని డీన్ ఎల్. కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలోని పిల్లల వైద్య చికిత్సా విభాగానికి చెందిన పీజీ విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్ విభాగంలో నలుగురు, పోస్టర్ కాంపిటీషన్‌లో ఇద్దరు జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న సందర్భంగా గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో డాక్టర్ రబియా షేక్ ప్రథమ స్థానంతో పాటు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిపే జాతీయ స్థాయి పోటీల్లో వరుసగా ఐదోసారి పురస్కారాన్ని అందుకోనున్నట్లు చెప్పారు. అవార్డులు అందుకున్న పీజీ విద్యార్థులను అధ్యాపకులు డాక్టర్ ఎ.జె. సాయిశంకర్‌లు ప్రత్యేకంగా అభినందించారు.